క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సత్కారం



బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్ల క్లస్టర్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన టీచర్లను ఆదివారం చప్పిడిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఎంఈవో సుబ్రమణ్యం మాట్లాడుతూ గత 9 ఏళ్లుగా మండలంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి టీచర్లు ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో రామారావు, శ్రీనివాసులు, కృష్ణయ్య, లక్ష్మీదేవి, అశ్వర్థ, చంద్రమోహన్, సుధాకర్, భరత్, మోహన్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుడి నిమజ్జనం



వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

పుంగనూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పుంగనూరు పట్టణంలోని కుమ్మరవీధిలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహాన్ని ఆదివారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాల మధ్య పట్టణంలో ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ గణపతిబప్పా మోరియా అంటూ నిమజ్జనానికి తరలివెళ్లారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జనసురక్షను సద్వినియోగం చేసుకోండి



జనసురక్ష చెక్కులు అందజేస్తున్న ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ పటేల్

పుంగనూరు: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనసురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ పటేల్ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం రాత్రి బోడేవారిపల్లెలో జనసురక్షపై ప్రచారం చేశారు. జనసురక్ష పథకం చెక్కులు అందజేశారు. జనసురక్ష పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిత్తూరు రీజనల్ మేనేజర్ సురేష్ బాబు, తిరుపతి ఏవో విజయకుమార్, స్థానిక బ్రాంచ్ చీఫ్ మేనేజర్ భవాని పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ ఏర్పాటు

వి.కోట: మండల దళిత ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీలను ఏర్పాటుచేశారు. మండలంలోని 12 పంచాయతీలకు ఇన్‌చార్జిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సమితి సభ్యులు తెలిపారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్ భవన నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం వెంకటస్వామి, నాయకులు ఉలగనాథన్, గణపతి, దొరస్వామి, శ్రీనివాసులు, గిరి, సురేంద్ర, ఆంజి, రాజగోపాల్ పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

గుడుపల్లె: చలి కాలంలో పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ముందు జాగ్రత్తగా సోమవారం నుంచి వచ్చే నెల 15 వరకు వరకు టీకాలు వేస్తున్నట్టు మండల పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 18 పంచాయతీల్లో గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మండలంలో 18,520 పాడి పశువులు వున్నాయని తెలిపారు. వీటికి ఆయా గ్రామాల్లోనే టీకాలు వేస్తామన్నారు. గాలికుంటు వ్యాధి బారిన పడిన పశువుల్లో తీవ్రమైన జ్వరం వుంటుందని, నీరసం, కొద్దిపాటి ఎండకు, చలికి కూడా పశువులు రొప్పుతాయని తెలిపారు. నోటి నుంచి తీగలా చొంగ కారుతుందని, నోటి మధ్య, కాలిగిట్టల మధ్య పుండ్లు వస్తాయని వెల్లడించారు. ఈ వ్యాధి సోకడం వల్ల పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. దూడలు మృతిచెందుతాయని తెలిపారు. వ్యాధి సోకిన వెంటనే వైద్యం చేయించాలని సూచించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

పలమనేరు: పిల్లలు స్మార్ట్ ఫోన్లను పక్కన పెట్టి పుస్తకాలు చదవాలని, తద్వారా జ్ఞానం పెంపొందుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు తెలిపారు. స్థానిక కళామందిరంలో ఆదివారం గ్రంథాలయ పితామహుడు గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు జయంతిని జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పుస్తకాలే కాకుండా వార్తా పత్రికలను చదవడానికి సైతం జనానికి ఆసక్తి లేకుండా పోతోందన్నారు. ఈ నేపథ్యంలో పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను వివరించారు.

వణికిస్తున్న డిజిటల్ అరెస్టులు

ప్రస్తుతం సమాజంలో మోసగాళ్ల ఆటలకు అంతులేకుండా పోతోంది. ముఖ్యంగా సాధారణ నేరాలకంటే డిజిటల్ మోసాలు ఎక్కువగా సాగుతున్నాయి. సైబర్ మోసగాళ్లు సమాజంలో పలుకుబడి ఉన్న వారిని టార్గెట్ చేస్తున్నారు. ముఖ్యంగా బయటి ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, ఐటీ ఉద్యోగుల తల్లిదండ్రుల మొబైల్ నంబర్లను సేకరించి ఫోన్ కాల్‌లోనే అరెస్టు చేసినట్టు భయాన్ని పుట్టించి దొరికినంత దోచేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ఇలాంటి ఫేక్ కాల్స్‌తో డిజిటల్ అరెస్టుల పేరుతో ఇప్పటికే కొందరు రూ.లక్షలు పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది. తాము మోసపోయామని చెప్పేందుకు సైతం బాధితులు ముందుకు రావడం లేదు.



మొబైల్ హ్యాకర్



సీబీఐ నుంచి మాట్లాడుతున్నానంటూ బెదిరింపు కాల్స్ చేస్తున్న వ్యక్తి

- డ్రగ్స్ కేసులో మీ అబ్బాయి అరెస్ట్ అంటూ పేరెంట్స్‌కు కాల్స్
- బాలికల ట్రాఫికింగ్‌లో ఉన్నారంటూ బెదిరింపులు
- మీ ఆధార్ నెంబర్‌పై ఫ్రాడ్ జరిగిదంటూ బ్లాక్ మెయిల్
- ఎవరికీ తెలియకుండా సెటిల్ చేసుకోవాలని హుకుం
- పలమనేరు డివిజన్‌లో జోరందుకున్న డిజిటల్ అరెస్టులు


పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి ఎమ్మార్సీలో పనిచేసే సీఆర్‌పీకి రామచంద్రప్పకు ఇటీవల ముంబయి క్రైంబ్రాంచి నుంచి కాల్ వచ్చింది. వెంటనే వాట్సాప్ ఆన్ చేయాలని చెప్పడంతో అతను వాట్సాప్ కాల్ చేశాడు. అవతలి వ్యక్తి తాను ముంబయి క్రైంబ్రాంచి డీఎస్పీ అంటూ పోలీస్ డ్రెస్ జాతీయ జెండా, గన్‌తో కనిపించాడు. దీంతో అతను భయపడి నమస్తే సార్ అనగానే మీకు ఏ భాష వచ్చు అనగా తెలుగు అని చెప్పాడు. దీంతో మరో వ్యక్తి వీడియో కాల్‌లోకి వచ్చి మీ ఆధార్ నంబర్ ఇదేనా అంటూ రామచంద్రప్ప ఆధార్ నెంబరు చెప్పాడు. అతను అవును అనగానే ఈ ఆధార్‌గల వ్యక్తి బాలికల కిడ్నాపింగ్ కేసులో ఇరుక్కుని మీ ఆధార్ సెల్ నంబర్లను ఇచ్చాడు. నిన్ను అరెస్ట్ చేస్తాం అని అన్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని చెప్పినా వారు వినలేదు. ఇందులో నుంచి బయటపడాలంటే లాయర్‌ను మేమే పెడతాం అందుకు రూ.20 వేల ఫోన్‌పే చేయమని బెదిరించారు. తన ఫోన్‌పేలో డబ్బులేదని చెప్పడంతో గంట సమయం ఇచ్చారు. దీంతో అతను అక్కడి పోలీసులను ఆశ్రయించగా వారు ఇది హ్యాకర్స్ మోసమని చెప్పడంతో ఆ నంబర్‌ను బ్లాక్ చేశారు. అదే రోజు గంగవరానికి చెందిన ఓ సీఆర్పీ, తిరుపతికి చెందిన మరో సీఆర్పీకి ఇలాంటి కాల్స్ వచ్చాయి. వీరు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మార్సీల్లో పనిచేసే సీఆర్పీలు కావడం గమనార్హం. వీరి సెల్ నంబర్లను సేకరించిన హ్యాకర్లు వరుసబెట్టి ఆ గ్రూపులోని వారినే టార్గెట్ చేసినట్టు అర్థమైంది.

పేట్రేగుతున్న మొబైల్ హ్యాకర్లు

మొబైల్ కొన్నాళ్లుగా హ్యాకర్లు పేట్రేగిపోతున్నారు. సెల్‌ఫోన్‌కొస్తున్న ఏపీకే యాప్‌లు, ఎస్ఎంఎస్‌లు, లింకులు దేన్ని ముట్టుకున్నా మనపని అయినట్టే. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాంల వాడకం కారణంగానే మనం హ్యాకర్లకు బుక్ అయిపోతున్నాం.

హ్యాకింగ్ నుంచి బయటపడాలంటే..

ఫోన్ హ్యాక్ కాకుండా మన స్మార్ట్‌ఫోన్‌లో ముందు కీప్యాడ్‌పై డబుల్ స్లాస్ డబుల్ జీరో 2 స్లాస్‌ను నొక్కాలి. దీంతో హ్యాకర్ల బారిన పడకుండా మన ఫోన్ రక్షింపబడుతుంది. ఫోన్‌లోని యాప్ నోటిఫికేషన్లను పరిశీలించి అన్నింటి పర్మిషన్లు ఉపసంహరించుకోవాలి. ఫోన్‌ను ఫ్యాక్టరీ సెట్టింగ్స్‌లో అన్ ఇన్‌స్టాల్ చేసుకుని కొత్త మెయిల్, పాస్‌వర్డ్‌లతో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. మన ఫోన్‌ను కొత్తఫోన్‌లోకి మార్చినప్పుడు ఎక్కువగా మెయిల్‌ను హ్యాక్ చేసే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



మొబైల్ సేఫ్టీగా ఉందంటే ఈ వివరాలు ఫోన్‌లో రావాలి

సైబర్‌సెల్ సేవలు అంతంతమాత్రమే

జిల్లాలో ఎలాంటి సైబర్ క్రైమ్‌లు జరిగినా వెంటనే సైబర్ సెల్ టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. ఆ నంబర్లకు ఎన్నిసార్లు కాల్ చేసినా లైన్ దొరకడం లేదు. దొరికినా వారు చెప్పే నంబరుకు కాల్ చేసినా పలు సందర్భాల్లో ఉపయోగం పెద్దగా కనిపించడం లేదనే మాట బాధితుల నుంచి వినిపిస్తోంది.

మనఫోన్ హ్యాక్ అయిందా లేదా ఎలా తెలుసుకోవాలంటే...

మన ఫోన్‌లో డయలర్ ప్యాడ్‌ను ఓపెన్ చేసి స్టార్ స్లాస్ 67 స్లాస్ లేదా స్టార్ స్లాస్ 21 స్లాస్ లేదా స్టార్ స్లాస్ 62 స్లాస్‌లను నొక్కితే ఎంఐఎం కోడ్ డిస్‌ప్లే అవుతుంది. ఇందులో అన్ని కాలమ్స్ నాట్ ఫార్వెర్డెడ్ అని కనిపిస్తే మనఫోన్ సురక్షితంగా ఉన్నట్టు.


ఈ కోడ్‌లతో ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయరాదు

ఇండియాకు సంబంధించిన ఇంటర్నేషనల్ కోడ్ ప్లస్ 91. ఈ మధ్య స్మార్ట్‌ఫోన్లకు ప్లస్ 92, ప్లస్ 44, ప్లస్ 1, ప్లస్ 968 నంబర్ల నుంచి కాల్స్ వస్తున్నాయి. వీటిని పొరబాటున లిఫ్ట్ చేస్తే మన ఫోన్ సులభంగా హ్యాకింగ్ అవుతుందని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ప్రతినెలా 5లోపు వేతనాలు ఇవ్వాలి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతి నెలా 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం బోయకొండలో విలేకరులతో మాట్లాడారు. చాలీ చాలని జీతాలతో బోయకొండలో కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వారికి 15వ తేదీ వస్తున్నా వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. అధికారులు సకాలంలో వేతనాలందించకపోగా లేనిపోని సాకులు చెప్పడం తగదన్నారు. విధుల్లో ఉన్న కాంట్రాక్ట్ కార్మికులపై కొందరు భక్తులు దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని, కార్మికులకు రక్షణగా అధికారులు నిలబడాలని కోరారు. కార్మికులకు సకాలంలో వేతనాలివ్వకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎంపీ చొరవతో తీరిన తాగునీటి సమస్య



సదుం: బోర్‌లో పుష్కలంగా వస్తున్న నీరు

సదుం: మండలంలోని కంభంవారిపల్లె పంచాయతీ గాండ్లపల్లెలో నెలకొన్న తాగునీటి సమస్య ఎంపీ చొరవతో తీరింది. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను గ్రామస్తులు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నూతన బోర్ వేయడానికి నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలో శనివారం రాత్రి గ్రామంలో బోర్‌ను డ్రిల్ చేశారు. ఇందులో పుష్కలంగా నీరు పడ్డాయని గ్రామస్తులు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించిన ఎంపీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దీప, మహేశ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, అన్నారెడ్డి, మోహన్ రెడ్డి, వెంకటేశ్, మోహన్, శ్రీనివాసులు, మహేంద్ర, మల్లయ్య, రెడ్డెప్ప, ఓబుల్ రెడ్డి, ఎల్లప్ప, బాబు, శేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



పుంగనూరులో కంటి వైద్య పరీక్షలకు వచ్చిన ప్రజలు



వి.కోట : వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు: స్థానిక బీఎంఎస్‌క్లబ్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 123 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు క్లబ్ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం తెలిపారు. 16 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించి కంటి అద్దాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు రఘునాథరెడ్డి, కేశవరెడ్డి, వరదారెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కంటి చికిత్సకు 36 మంది ఎంపిక

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం చెన్నై శంకర నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ గ్రామాల నుంచి 65 మంది పరీక్షలు చేసుకున్నారు. వారిలో 36 మంది కంటి చికిత్సలకు ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి చెన్నై శంకరనేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు చేసి అద్దాలు అందజేస్తామని పేర్కొన్నారు. వైద్యులు మురళీక్రిష్ణ, శ్రీనివాసులు, రమణ, గంగాధర పాల్గొన్నారు.



రొంపిచెర్లలో ఉచిత కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



బైరెడ్డిపల్లె : ఆపరేషన్లు చేసుకున్న వారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

వి.కోటలో..

వి.కోట: పట్టణంలోని ఎస్‌కే ఎమర్జెన్సీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ కిరణ్ సంపత్ మాట్లాడుతూ బెంగళూరు మణిపాల్ హాస్పిటల్ వైద్యులు సుమారు 450 మంది రోగులకు పలు పరీక్షలు చేశారని తెలిపారు. వారికి మందులు అందజేసినట్టు పేర్కొన్నారు. వైద్యులు సంపత్ కిరణ్, ప్రదీప్ హరినహలి, బాలాజీ, లక్ష్మి నరసింహశెట్టి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 15 మంది ఎంపిక

రొంపిచెర్ల: ఉచిత కంటి ఆపరేషన్లకు 15 మంది ఎంపికైనట్లు తిరుపతికి చెందిన ఎస్ హాస్పిటల్ డాక్టర్ రాజ్ యశ్వంత్ తెలిపారు. రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని ముత్యాలమ్మ గుడివీధిలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 47 మంది వృద్ధులు వైద్య పరీక్షలు చేసుకున్నారు. వారిలో 15 మందికి ఆపరేషన్ అవసరమున్నట్టు గుర్తించినట్టు డాక్టర్ రాజ్‌యశ్వంత్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



సదుం: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సదుం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988–89లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. వృత్తిరీత్యా పలు ప్రాంతాల్లో స్థిరపడిన వారు 36 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఆనాటి సంగతులను గుర్తు చేసుకుని ఆహ్లాదంగా గడిపారు. ఒకరినొకరు పలకరించుకుని, ఇన్నాళ్లు అందుబాటులో లేని వారి వివరాలు తెలుసుకున్నారు. తరచూ కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూజించి, సమావేశంలో ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. రాయలపేట నుంచి పలమనేరుకు నిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయి. అదేవిధంగా పలమనేరు నుంచి చౌడేపల్లి, ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ దర్శనార్థం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు వాహనాల్లో రాయలపేట మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో రోడ్డు దాటాలంటే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పలమనేరు రోడ్డులో వున్న ఎంపీపీ పాఠశాల

దోమల నివారణకు చర్యలు



దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తున్న సబ్‌యూనిట్ అధికారి జయశంకర్

బైరెడ్డిపల్లె: దోమకాటుతో జ్వరాలు ప్రబలుతాయని, వాటి నివారణకు ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలని జిల్లా సబ్ యూనిట్ అధికారి జయశంకర్ తెలిపారు. ఆయన ఆదివారం కమ్మనపల్లె గురుకుల పాఠశాల విద్యార్థినులకు దోమకాటుతో ప్రబలే జ్వరాలపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ రాజారెడ్డి పాల్గొన్నారు.

బయ్యప్పగారిపల్లెలో బాబుష్యూరిటీ - మోసం గ్యారెంటీ



క్యూఆర్ కోడ్ కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

పలమనేరు: మండలంలోని బయ్యప్పగారిపల్లి పంచాయతీలో ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆ పంచాయతీ వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, చేస్తున్న మోసాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, సర్పంచ్ బుజ్జమ్మ, ఎంపీటీసీ రమేష్, గోవిందునాయుడు, సతీష్ పాల్గొన్నారు.

బోయకొండ కిటకిట



స్తంభించిన ట్రాఫిక్

- రద్దీగా మారిన క్యూలైన్లు
- స్తంభించిన ట్రాఫిక్

చౌడేపల్లె : కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పేరుగాంచిన బోయకొండ ఆదివారం కిక్కిరిసింది. అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన దినం కావడంతో పాటు ఇష్ట దైవంగా కొలిచే కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువ జామున 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొండపై ఎటుచూసినా భక్తజన సందోహంతో రద్దీగా మారింది. అర్చకులు అమ్మవారిని బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో క్యూలు రద్దీగా మారాయి. గంటల తరబడి నిరీక్షించి భక్తులు దర్శనం చేసుకున్నారు. సుమారు 20 వేలమందికి పైగా అమ్మవారిని భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు. ఊహించని రీతిలో వాహనాల్లో భక్తులు తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. భక్తులు, వాహనదారులు అవస్థలు పడ్డారు.



ప్రధాన ఆలయం నుంచి ముఖద్వారం వెలుపలి వరకు క్యూలో భక్తజనం



రంగుల గౌళి

బోయకొండలోని శ్రీ రణభేరి గంగమ్మ ఆలయంలో ఆదివారం పెద్ద ఆకారంలో గల బల్లి(గౌళి)ని భక్తులు గుర్తించారు. సాధారణంగా బల్లి చిన్నదిగా ఉంటుంది. ఆలయంలో ఉన్న బల్లి పెద్దదిగా ఉండడంతో పాటు పసుపు రంగులో ఉంది. బల్లిని చూసిన భక్తులు పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధించారు. -చౌడేపల్లె